ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 25 డిసెంబరు 2024 | 5





సముద్రంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులు - మెయిలో



కాకినాడ సముద్రతీరంలో లంగరు వేసుకుని ఉన్న స్టెల్లా ఎల్‌నౌక

స్టెల్లాఎల్ నౌకకు అన్నీ అవాంతరాలే!

▸ వాతావరణం అనుకూలించదు ▸ నౌక గమ్యం చేరదు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ సముద్రంలో లంగరు వేసుకుని ఉన్న స్టెల్లా ఎల్ పనామా నౌకకు అన్ని అవాంతరాలే ఎదురవుతున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల నౌకలోని రేషన్ బియ్యం ఒడ్డుకు చేర్చలేకపోతున్నారు. దీంతో నౌక గమ్యం చేరే పరిస్థితి చేరడం లేదు. మంగళవారం కూడా తుఫాను ప్రభావంతో బియ్యాన్ని తీసుకురాలేకపోయారు. స్టెల్లాఎల్ పనామా నౌక కాకినాడ సముద్ర తీరానికి వచ్చి దాదాపు నెల రోజులవుతోంది. దీనిలో రేషన్ బియ్యం ఉన్నాయనే సమాచారంతో ఈనెల 4వ తేదీన అధికారుల బృందం తనిఖీలు చేసి గుర్తించింది. దీనిలో 1320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నాయని ఈనెల 17వ తేదీన జిల్లా కలెక్టర్ ప్రకటించారు. దీంతో ఈ బియ్యాన్ని భారీ నౌక నుంచి బార్జీల ద్వారా తీసుకురావడానికి అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా తుఫాను ప్రభావంతో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో సముద్రంలో అలల ఉధృతి పెరిగింది. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం ఒడ్డుకు తరలించడం అసాధ్యంగా మారింది. పైగా ఈనెల 26వ తేదీ నుంచి మరో తుఫాను సంభవించే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో ఈ ప్రక్రియ మరింతగా ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇక ఈ భారీ నౌకలో నుంచి బియ్యం అన్‌లోడింగ్ అయిన తర్వాత మరో 12వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేయాలి. తర్వాతే ఈ నౌక కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి పశ్చిమ ఆఫ్రికాలో కోటోనౌ పోర్టుకు వెళతుంది. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి పశ్చిమ ఆఫ్రికాకు 26 రోజుల ప్రయాణ సమయం పడుతుంది. ఈ నౌక లోడింగ్ చేసుకుని వచ్చే జనవరి నెలాఖరుకు కోటోనౌ పోర్టుకు చేరుకుంటుందని నౌక అధికారులు భావిస్తున్నారు.

గోదాములపై ఉక్కుపాదం

▸ ప్రైవేట్ గోదాముల్లో తనిఖీలు ▸ రేషన్ బియ్యం మాయంపై సీరియస్

▸ దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ ఎండీ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం కొరిపల్లి అద్దె గోదాములో రేషన్ బియ్యం మాయంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. అన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించింది. కాకినాడ జిల్లాలో ఎనిమిది గోదాములను పౌరసరఫరాల సంస్థ అద్దెకు తీసుకుని రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నిల్వ చేసింది. అయితే ఇటీవల కొరిపల్లి గోదాములో బియ్యం మాయమైనట్టు సమాచారం వచ్చింది. దీంతో అధికారులు తనిఖీ చేసి 229 మెట్రిక్ టన్నులు మాయమైనట్టు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈనేపథ్యంలో మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్ ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో రేషన్ బియ్యం నిల్వ చేసిన ప్రతిగోదామును తనిఖీలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. రికార్డులను పరిశీలించి గోదాముల్లో ఉన్న బియ్యాన్ని తనిఖీలు చేసి వ్యత్యాసాలుంటే గుర్తించాలని సూచించారు. ఎక్కడైనా రేషన్ బియ్యం ప్రైవేట్ గోదాం యజమానులు మాయం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో ఒక వరుస క్రమంలో రేషన్ నిల్వ చేసిన గోదాములను తనిఖీ చేసి నివేదిక పంపిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.



సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ సామగ్రి గోదాం ఏర్పాటుకు మంగళవారం స్థలం పరిశీలన చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశించారు. కాకినాడ జేఎన్‌టీయూ సెమినార్ హాల్లో మంగళవారం జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో విద్యుత్ సరఫరా నిరంతరం చేయాలన్నారు. వచ్చే వేసవిలో కూడా విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్లను వేగంగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో కొత్త సర్కిల్ కార్యాలయం ఏర్పాటు అయినందున దీనికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎస్‌ఈ ప్రసాద్, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట ఈఈలు ఉదయ్‌భాస్కర్, ప్రభాకర్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

గోదాం స్థలం పరిశీలించిన సీఎండీ

సామర్లకోట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సామగ్రి నిల్వచేసే గోదాం ఏర్పాటుకు స్థల పరిశీలనను తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ మంగళవారం నిర్వహించారు. విశాఖ నుంచి సామర్లకోటకు నేరుగా చేరుకొన్న సీఎండీ సామర్లకోటలో బొమ్మూరు కేంద్రంగా విద్యుత్ సామగ్రి గోదాం నిర్వహిస్తున్న రీతిలోనే కాకినాడ జిల్లాకు సంబంధించి పలు సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సామగ్రిని సరఫరా చేసేందుకుగాను సామర్లకోట విద్యుత్‌సబ్‌స్టేషన్ అవరణలో నిల్వచేసేలా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ స్థల సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్‌సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ సామగ్రి గోదాం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై స్థానిక ఈఈ ప్రభాకర్, డీఈ ప్రసాద్, ఏడీఈ కిరణ్‌కుమార్ తదితర విద్యుత్ అధికారులతో సీఎండీ పృథ్వీతేజ్ సమీక్షించారు.



క్రిస్మస్ సందర్భంగా కాకినాడలో ప్రత్యేక ప్రార్థనలు.. చర్చిలో విద్యుత్ వెలుగులు

చలి వణికిస్తోంది!

▸ 24-25 డిగ్రీలకు పడిపోయిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

▸ గాలుల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి ▸ జిల్లాలో పలుచోట్ల వర్షాలు

▸ తడిచిన ధాన్యం రాశులు ▸ పంట రక్షణకు రైతుల పాట్లు



పిఠాపురంలో వాన.. గొల్లప్రోలు వద్ద ధాన్యం రాశులు తడవకుండా కప్పిన బరకాలు



పిఠాపురం/గొల్లప్రోలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చలి వణికిస్తోంది. గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఎన్నడూ లేనివిధంగా 24-25 డిగ్రీలకు పడిపోయాయి. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతోపాటు జిల్లాలో పలుచోట్ల మంగళవారం వర్షం పడింది. అకాల వర్షాలకు కళ్లాలు, పొలాల్లో ఉండిపోయిన ధాన్యం రాశులు తడిచాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీన పడినట్టే పడి తిరిగి అల్పపీడనం కోస్తా ప్రాంతానికి దగ్గరగా రావడం, ఆపై ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో తుఫానును మరిపించే రీతిలో వాతావరణం మారింది. శీతాకాలం కావడం, ఆకాశంలో మేఘాలు ఉదయం నుంచి రాత్రి వరకూ అలముకుని ఉండడంతోపాటు చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంట్లో గదుల్లో వాతావరణం కూడా ఐస్ మాదిరిగా చల్లగా ఉండడంతో వణికిపోతున్నారు.. చలిగాలుల తీవ్రతతో క్రిస్మస్ అయినప్పటికీ జనసంచారం అంతగా కనిపించలేదు. దుకాణాలు వద్దే రద్దీ ఉంది. సోమవారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జిల్లాలోని కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు సహా అన్ని ప్రాంతాల్లోనూ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు పైగా వర్షం పడడంతో వాతావరణం మరింత చల్లగా మారింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో అన్ని ప్రాంతాల్లో 24-25 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

శ్వాససంబంధ సమస్యలతో ఇబ్బంది

రాత్రి పూట చలితీవ్రత, పగటిపూట చలిగాలులతో శ్వాస సంబంధ సమస్యలు అధికమయ్యాయి. చిన్నారులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడడంతోపాటు కఫం అధికం అవ్వడంతో ఆసుపత్రులకు తీసుకువస్తున్నారు. వృద్ధుల్లోనూ ఈ ఇబ్బంది అధికంగా ఉంది. చిన్నారులను బయట గాలిలో తిప్పవద్దని, అత్యవసరమైతే వంటికి గాలి తగలకుండా ఉన్ని దుస్తులు వేయడంతోపాటు రక్షణగా గుడ్డ కప్పాలని వైద్యులు సూచిస్తున్నారు. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలో సాధ్యమైనంత వరకూ వృద్ధులు, చిన్నారులు, ఆస్మా, ఇతర శ్వాస సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నవారు బయటకు రాకుండా ఉంటే మంచిదని వారు తెలిపారు.

తడిచిన ధాన్యం

వాయుగుండం బలహీనపడిన సమయంలో రెండు రోజుల కిందట ఎండకాయడంతో రైతులు వరి మాసూళ్లు చేపట్టారు అయితే ఇలా ఆరబెట్టిన కళ్లాలు, పొలాలు, లేఅవుట్ స్థలాల్లో ఉంచిన ధాన్యం రాశులు సోమవారం వర్షానికి తడిచాయి. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, బరకాలు కప్పినా నేల మీద నుంచి నీరు అడుగు భాగానికి చేరడంతో కింద భాగంలో ఉన్న ధాన్యం నీట తడిచింది. ఇంకా నూర్చకుండా పొలాల్లో ఉంచి వరి కుప్పల్లోకి నీరు చేరకుండా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



కొట్టాంలో తడిసి మొలకెత్తిన వరి పంట

అన్నదాతల ఆందోళన

కోటనందూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):తుఫాను ప్రభావంతో ఐదు రోజుల నుంచి అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా వరుస తుఫాన్లతో ఈసారి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితిలో ఉన్నారు. కోటనందూరు మండలంలో ఇప్పటికే 70 శాతం పైగా కోతలు పూర్తయి పనల మీద ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు వ్యవసాయాధికారులు సూచనలిస్తూ రైతులకు ధైర్యం చెబుతున్నా రైతులు కలవరపడుతున్నారు. వర్షంలో తడవడం వల్ల వరి పంట గింజ రాలిపోతుందని రైతుల వాపోతున్నారు. మండలంలోని అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

బ్యాంకర్ల నిర్లిప్తత

▸ సున్నా వడ్డీ రైతుల వివరాల నమోదులో తీవ్ర జాప్యం

▸ నేటితో ముగుస్తున్న నమోదు గడువు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): బ్యాంకర్ల నిర్లిప్తత కారణంగా రైతులకు రావాల్సిన వడ్డీ మాఫీ నష్టపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. సకాలంలో బ్యాంకు పోర్టల్‌లో రుణాలు చెల్లించిన వారి పేర్లు నమోదు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. కాకినాడ జిల్లాలో గత ఏడాది పంటల కోసం సున్నా వడ్డీ పంట రుణాలు తీసుకున్నారు. ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున వివిధ బ్యాంకుల నుంచి సున్నా వడ్డీ పంట రుణాలు పథకంలో తీసుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం కేవలం ఏడాదిలోపు రుణాలు తిరిగి చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ మాఫీ అవుతుంది. అంటే ఒక్కొక్క రైతు రూ.7 వేల వరకు నష్టపోయే ప్రమాదం ఉంది. కాకినాడ జిల్లాలో మొత్తం ఎనిమిది వేల మంది రైతులు సున్నావడ్డీ పంట రుణాలు ఏడాదిలోపు తిరిగి బ్యాంకులకు చెల్లించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 3,214 మంది రైతుల వివరాలు మాత్రమే బ్యాంకు పోర్టల్‌లోకి నమోదు చేశారు. ఆప్కాబ్, చైతన్యగోదావరి, గ్రామీణ బ్యాంకుల్లో నమోదు ప్రక్రియ వేగంగా జరిగింది. అయితే కొన్ని కమర్షియల్ బ్యాంకుల్లో పోర్టల్‌లోకి పేర్ల నమోదులో తీవ్ర జాప్యం జరిగింది. బుధవారంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వడ్డీమాఫీ వస్తే రబీలో వ్యవసాయ పెట్టుబడులకు కొంత సాయంగా ఉంటుందని రైతులు భావించారు. అయితే బ్యాంకర్ల నిర్లక్ష్యంతో రైతులకు నిరాశ ఎదురైంది. ఈ విషయమై జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఇటీవల విజయవాడలో జరిగిన స్టేట్ లెవెల్ బ్యాంకర్ల మీటింగ్‌లో కూడా దీనిపైన చర్చ జరిగిందని, ఆ మేరకు తగిన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పోర్టల్‌లో రైతుల పేర్లు నమోదు చేసేందుకు గడువు ఇస్తారని ఆశిస్తున్నామని చెప్పారు.

మున్సిపాలిటీలకు మహర్దశ

● వచ్చే ఏప్రిల్ నుంచి నేరుగా నిధులు ● బిల్లుల చెల్లింపులు కమిషనర్ల చేతికే

● నిధులపై నియంత్రణ ఎత్తివేత ● నిధుల దుర్వినియోగానికి ప్రభుత్వం అడ్డుకట్ట

పెద్దాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మున్సిపాలిటీల నిధులను సొంత ఖర్చులకే వినియోగించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇకపై మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో వసతుల కల్పనపై దృష్టి సారించనున్నారు. ఏ మున్సిపాలిటీ నిధులను ఆ ప్రాంతంలోనే అభివృద్ధి పనులకు వినియోగించుకునేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మున్సిపాలిటీలు మరింతగా ఆర్థిక పరిపుష్టి సాధించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుంది. ఇక గత ప్రభుత్వంలో మున్సిపాలిటీలు ఎదుర్కొన్న ఆర్థిక సమస్యలకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని కనుగొంది. గత వైసీపీ ప్రభుత్వంలో అత్యవసరంగా చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యంతో మున్సిపాలిటీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ జిల్లాలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని, ఏలేశ్వరం, గొల్లప్రోలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు కూడా వేయలేని పరిస్థితి ఉండేది. ఆస్తి పన్ను, ఇతర పద్దుల కింద సమకూరిన సాధారణ నిధులతోనే పనులు చేయడమే మున్సిపాలిటీలు మానుకున్నాయి. ఫలితంగా మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యంవంటి సమస్యలతో గత ఐదేళ్లలో తీవ్ర అవస్థలను ప్రజలు అనుభవించారు. మున్సిపాలిటీల్లో నిధులపై ప్రభుత్వ నియంత్రణ ఇక ఉండదు. సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో బిల్లుల అప్‌లోడ్ చేయడం వాటి కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. వివిధ పద్దుల కింద వచ్చే ఆదాయాన్ని అదే ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వినియోగించుకోవచ్చు. కమిషనర్లకు బిల్లులు చెల్లించే అధికారం ఉంటుంది. అలాగే స్థానికంగా నిధులు దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం తగు చర్యలను తీసుకోనుంది. అలాగే అభివృద్ధి పనులపై నిరంతరం తనిఖీలు చేయనున్నారు.

నిధుల దుర్వినియోగానికి చెక్

మున్సిపాలిటీల్లో ఇకపై నిధుల దుర్వినియోగానికి కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేయనుంది. ఆ దిశగా ప్రణాళికలను రూపొందించింది. సీఎఫ్‌ఎంఎస్ ఉద్దేశానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. సీఎఫ్‌ఎంఎస్‌కు అనుసంధానించిన మున్సిపాలిటీల పీడీ ఖాతాల ద్వారా క్రమపద్ధతిలో బిల్లులు చెల్లించాలన్న దానికి విరుద్ధంగా గత ప్రభుత్వం వ్యవహరించింది. రూ.కోట్ల నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉండిపోయాయి. రోజువారీ కార్యకలాపాలపైన ఇది తీవ్ర ప్రభావం చూపింది. చెత్త ట్రాక్టర్లకు డీజిల్ పోయించలేని దుస్థితి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిధులపై నియంత్రణను ఎత్తివేసి బిల్లుల చెల్లింపు కమిషనర్ల చేతికే అప్పగించనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా, ఇతర అధికారులు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పీజీఆర్ఎస్ అర్జీల అవగాహన కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): ప్రజా విజ్ఞాపనల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా అందిన అర్జీలపై నాణ్యమైన, సంతృప్తికరమైన సత్వర పరిష్కారాలను ప్రజలకు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ర్యాంకింగ్ ప్రధానంగా 5 పరిమితుల మీద నిర్ణయిస్తారన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీల సంఖ్య నిర్దిష్టకాల పరిధిలో పరిష్కరించిన అర్జీల సంఖ్య, అర్జీదారులకు సంతృప్తితో అందించిన నాణ్యమైన పరిష్కార సంఖ్య, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. జిల్లాలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార స్థాయి 62.7 శాతంగా ఉందన్నారు. దీనిని మరింత మెరుగుపరచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకింగ్ సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్జీదారునికి పరిష్కారంపై వివరించి తీసుకున్న ఫోటోలను ఆన్‌లైన్‌లో సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. అర్జీల పరిష్కారాన్ని గడువు సమీపించే వరకు జాప్యం చేయకుండా సకాలంలో చర్యలు పూర్తి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులందరూ హౌస్ హోల్డ్ మ్యాపింగ్ మాడ్యూల్‌లో తమ సమాచారాన్ని వెంటనే అప్‌లోడ్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, డీఎల్డీవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షకుడు ఉదయించినాడు..

- ఆంధ్రజ్యోతి, అమలాపురం టౌన్

నేడే క్రిస్మస్



అమలాపురం మన్నా జూబ్లీ చర్చి ప్రాంగణంలో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటుచేసిన దీపాలంకరణలు



45 అడుగుల క్రిస్మస్ ట్రీ

పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్డులో ఉన్న తండ్రీ కుమార పరిశుద్ధాత్మక మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన 45 అడుగుల క్రిస్మస్ ట్రీ, స్టార్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ప్రార్థనా మందిరం నిర్వాహకులు రౌతు సూరిబాబు, పరంజ్యోతి తెలిపారు. - పెద్దాపురం





యానాంలో రోమన్ కేథలిక్ చర్చి

సువార్త...

"భయపడకండి.. ఇదిగో ప్రజలందరికినీ కలుగబోవు మరో సంతోషకరమైన సువార్తమానం చెబుతున్నా.. దావీదు పట్టణంలో నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు.."

- లూకా సువార్త 2:10

'నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించు..' అని క్రీస్తు పలికిన చిన్న వాక్యంలో అద్భుతమైన సందేశం ఉంది. దుర్మార్గులను, సన్మార్గులను, పతితులను, పవిత్రులను ఒకే దృష్టితో ప్రేమించగలిగే దివ్య మానసాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠించుకోవాలని క్రీస్తు చెప్పారు. మానవజాతికి సన్మార్గాన్ని చూపిన ప్రవక్తలెందరో ఉన్నారు.. వారిలో ఏసుక్రీస్తుకు మాత్రం ప్రత్యేక స్థానం ఉంది. ప్రేమ.. కరుణ.. దయలకు ప్రతిరూపంగా ఏసుక్రీస్తు భువిపై మానవ రూపంలో జన్మించారు. ప్రతీ వ్యక్తి తోటివారిని ప్రేమగా చూడాలని.. దయతో క్షమించాలని.. కరుణామయులుగా మెలగాలని మానవజాతికి ఆయన అందించిన శుభసందేశం. అంతటి ప్రేమామయుని జన్మదినమంటే ఎందరికో పండుగే మరి. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి వ్యక్తి తనతో అన్వయించుకుని జీవిస్తే జగమంతా ప్రేమమయమే. పాపం చేసినవారికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలని ఏసుక్రీస్తు పలికారు. సమస్త మానవాళి పాప పరిహారార్థం దేవుడు నరుడిగా జన్మించిన పవిత్రమైన రోజు క్రిస్మస్. సంపూర్ణ మానవత్వమే మనిషిని మహా పురుషుడిగా, దైవ స్వరూపుడిగా మారుస్తుంది. ఇదే క్రిస్మస్ పర్వదినం ద్వారా సమస్త మానవాళికి అందించే శుభసందేశం.



నిత్య సంతోషమును అనుగ్రహించె క్రీస్తు

ఫిలిప్పీయులకు అందించిన సువార్తలో ఎల్లప్పుడూ ప్రభువునందు ఆనందించుడి అన్న వాక్యాన్ని మరల మరలా గుర్తించాలి. ఐహిక విచారము నుంచి విడిపించి నీయందు నిరీక్షణతో వచ్చే సంతోషము అనుగ్రహించమని ఆ దేవాది దేవుడిని వేడుకోవాలి. ఈ లోక మాలిన్యమును తొలగించి నన్ను సరిచేయమని వేడుకుని నీ హృదయాన్ని పోలిన మనస్సు నాకు దయచేయండి అని రోమా 12:2 చెబుతుంది. నీ నీతి అనే వస్త్రాన్ని నాకు ధరింపచేసి నీతిని అనుసరించు వ్యక్తిగా సమాధానము కోరి దానిని వెంటాడు వ్యక్తిగా నన్ను చేయమని రోమా 14:17 చెబుతుంది. **- రెవ కేకే పాల్, సెయింట్ లూథరన్ చర్చ్, అమలాపురం**



పాపముల నుంచి రక్షించే ఏసు

భయపడకండి ఇదిగో ప్రజలందరికినీ కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానమును నేను మీకు తెలియచేయుచున్నాను. దావీదు పట్టణమునందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఆయనే ప్రభువైన ఏసుక్రీస్తు అని లూకా రెండవ అధ్యాయం పదవ వచనం చెబుతుంది. ఏసుకృప, సత్య, సంపూర్ణుడిగా మన మధ్యలో నివశించడం యెహోవా కృప.

- రెవ.ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరుజ్యోతి తాతపూడి, అమలాపురం



దేవుడే నరుడై జన్మించినరోజు

సర్వలోక రక్షణ కొరకు దేవుడే నరుడై జన్మించిన రోజు క్రిస్మస్. సృష్టి ఆదియందు వాక్యముగా ఉన్నవాడు శరీరధారిగా ఏసుక్రీస్తుగా జన్మించెను. తాను నిర్మించిన మానవజాతి దేవుని చిత్తమునకు దూరమై వారి ఆత్మీయ రూపాన్ని పోగొట్టుకొనుచుండగా తిరిగి వారిలో ఆత్మీయ రూపాన్ని ఎరకపరిచే నిమిత్తం ఏసుక్రీస్తు భువిపై జన్మించెను(యోహాను 1:14, హెబ్రి 1:14,15). మానవాళి కొరకు ఎన్నో కార్యాలు జరిపించేందుకు క్రీస్తు మానవావతారునిగా జన్మించినట్టు(యోహాను 3:16) బైబిల్ చెబుతుంది. **- రెవ.కార్ల్‌డేవిడ్ కొమానపల్లి, మన్నాజూబ్లీ చర్చ్, అమలాపురం**



పోప్ జాన్‌పాల్-2 జ్ఞాపకార్థం కాంగో డెమొక్రటిక్ రిపబ్లిక్ దేశం 25 ఫ్రాంకుల నాణేన్ని విడుదల చేసింది. యాక్రిలిక్ పదార్థంతో తయారుచేయడం వల్ల ఆ నాణెం పారదర్శకంగా ఉంటుంది. 140 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన నాణెం బరువు కిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కేవలం 401 నాణేలను మాత్రమే ముద్రించారు. అరుదైన ఈ నాణేన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు.

- అమలాపురం టౌన్

చర్చిలన్నీ ముస్తాబు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు



కాకినాడ రామారావుపేటలోని ఇమ్మాన్యుయేల్ బాప్టిస్టు చర్చి



కాకినాడలోని హౌస్ ఆఫ్ ప్రేయర్



కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలైంది. డిసెంబరు మాసం మొదటి నుంచి క్రైస్తవ వేడుకలు నిర్వహించుకుంటున్నారు. డిసెంబరు 25న ప్రపంచమంతా జరుపుకుంటున్న క్రిస్మస్ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ కావడంతో బుధవారం చర్చిల్లో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో క్రీస్తు విశ్వాసులతోపాటు మిషనరీలు బలంగా పనిచేస్తుండడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం వంటి జిల్లా కేంద్రాలతోపాటు నగరాలు, గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటారు. ఇప్పటికే పండుగ నిర్వాహణకు అవసరమైన కొనుగోళ్ల కోసం క్రీస్తు విశ్వాసులు దుకాణాలను సందర్శిస్తుండడంతో పట్టణాల్లో వీధులు, దుకాణాలు రద్దీగా మారుతున్నాయి. క్రిస్మస్ పండుగ సమీపిస్తుండగానే ఏసు ప్రభువు లోకానికి వచ్చాడన్న సందేశం చాటుతూ క్రైస్తవులు ఇళ్ల మీద క్రిస్మస్ తారను వేలాడదీయడం ఆనవాయితీ. నక్షత్రాన్ని పోలిన ఆకృతిలో లైటింగ్ ఏర్పాటు చేసి ఇంటిపై అలంకరిస్తారు. వాటి కొనుగోళ్లతోపాటు పండుగలో ప్రధాన భూమిక పోషించే క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాస్ వేషధారణలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్రని దుస్తులు, తెల్లని గడ్డం, పొడవు టోపీ ఆసక్తికరంగా ఉండే క్రిస్మస్ తాత వేషం ధరించడం క్రిస్మస్ సంబరాల్లో ఒకటి కావడంతో నగరంలో వీటి విక్రయాలు జరుగుతున్నాయి. వీటితోపాటు పండుగ నాడు అవసరమయ్యే కేకులను, స్వీట్లను ఆర్డర్లు చేస్తుండడంతో స్వీట్ దుకాణాలు కళకళాడుతున్నాయి. పిండి వంటల కోసం సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. కాగా మరోపక్క విద్యాలయాలు, తదితర చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అన్ని క్రైస్తవ మిషనరీలు, వసతి గృహాలు, చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

కారుణ్య నియామకాలు త్వరితగతిన చేపట్టాలి



జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు త్వరితగతిన కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ కాకినాడ జిల్లా ఎస్టీయూ పక్షాన జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల నుంచి ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబీకులు 91 మంది కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేశారన్నారు. జాప్యం వల్ల వారి కుటుంబ సభ్యుల ఆర్థిక, మానసిక ఇబ్బందుల దృష్ట్యా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి త్వరితగతిన పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీను, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణంరాజు, పి.శ్రీను. రామ్‌తేజ, మహేష్, శ్రీకాంత్ తదితరులు వున్నారు.

భవనం సమస్య పరిష్కారానికి వినతి

కాకినాడ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ భవనంపై తలెత్తిన సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు మంగళవారం జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో జేసీ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కాకినాడ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సత్తిరాజు, ఉమ్మడి జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు

ఉపాధి హామీలో వ్యవసాయానికి ప్రాధాన్యం

- లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలి
- లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవు
- అధికారులకు అల్లూరి జిల్లా కలెక్టర్ హెచ్చరిక
- చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని, ముఖ్యంగా వ్యవసాయానుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతి మండలంలో వంద పంట కుంటలను నిర్మించాలన్నారు. లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం సక్రమంగా అందించాలని, బలహీనంగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎంపీడీవోలు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని, గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు హౌసింగ్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయని చింతపల్లి, హుకుంపేట, వీఆర్ పురం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. లబ్ధిదారుల వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో నమోదు చేయకపోతే ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వర్తించని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయంలో ఎంపీడీవోలు అశ్రద్ధగా వ్యవహరించవద్దని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వభరత్, సబ్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, 22 మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శత చండీ మహా యాగం



మహా రుద్ర సహిత శత చండీ మహా యాగంలో పాల్గొన్న భక్తులు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీ మహా రుద్ర సహిత శత చండీ మహాయాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. 108 యజ్ఞ కుండాలతో 116 మంది రుత్విక్కుల మంత్రోచ్చారణల మధ్య యాగ క్రతువును భక్త దంపతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వశాంతి, ధర్మపరిరక్షణ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈ నేలపై ఉండాలని శ్రీసన్నిధి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న మహా యాగంలో 50 మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగ సాధువులు పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందజేశారు.



హైకోర్టు జడ్జి మన్మథరావు నుంచి పురస్కారం అందుకుంటున్న సీతాపతిరావు

సీతాపతిరావుకు జీవిత సాఫల్య పురస్కారం

కాకినాడ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్, ఏఐఎఫ్‌టీపీ, లోకల్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ తిరుపతిలో నిర్వహించిన సెమినార్‌లో ఏపీ హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు నుంచి బీఎస్ తిరుపతిరావు జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈయన జీఎస్టీ చట్టంలోని వివిధ అంశాలపై 500 వ్యాసాలు రచించారు. సేవలకు గుర్తింపుగా 74, 75 గణతంత్ర వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలను కలెక్టర్ నుంచి అందుకున్నారు. వృత్తి నిపుణులకు సుమారు 200 సెమినార్లు, 175 శిక్షణా తరగతులు, సుమారు 500 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చారు. తిరుపతిరావును కాకినాడ ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

28న కాకినాడ ఐటీఐలో మినీ జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, గవర్నమెంట్ ఐటీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ కాలేజీలో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులన్నారు.

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

ఈదురుగాలులతో ఉప్పొంగుతున్న సముద్రం

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తీరంలో వీస్తున్న ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్రం లోపలి నుంచి ఒడ్డుకు బలంగా గాలులు వీచడంతో సముద్రం ఉబ్బెత్తుగా మారుతోంది. కెరటాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. అలల తీవ్రతకు అమీనబాద్ సమీపంలోని పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి సముద్రం నీరు ప్రవేశిస్తోంది. వరుస తుపాన్లతో తీర ప్రాంత మత్స్యకారులు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





సత్యదేవుడి వ్రతమాచరిస్తున్న జిల్లా ఎస్పీ, కలెక్టర్ దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు

- వ్రతమాచరించిన కలెక్టర్, ఎస్పీ దంపతులు

అన్నవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ జిల్లా యంత్రాంగాన్ని నడిపించే అధిపతులు సహజంగా పలు పర్యాయాలు ఇద్దరూ ఒకే వేదికను పంచుకుంటుంటారు. వారిద్దరూ కుటుంబంతో ఒకే ఫ్రేమ్‌లో కనపడడం అరుదుగా ఉంటుంది. మంగళవారం వారిరువురి దంపతులు సత్యదేవుడి వ్రతమాచరించారు. వారే జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం వారిరువురు కుటుంబసభ్యులతో స్వామివారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎస్పీ, కలెక్టర్ దంపతులకు ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్.ఐ. హరిబాబు తదితరులు ఉన్నారు.

ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడపోర్టు వరకు చేపడుతున్న ఏడీబీ రోడ్డు విస్తరణ పనులను మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతతో రాజీ లేకుండా త్వరిత గతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు రావాలన్నారు.

జీజీహెచ్‌లో మానసిక రోగి

ఆత్మహత్యాయత్నం

- విషమంగా విశాలాక్షి ఆరోగ్యం



కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న మానసిక వైద్యులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి బట్టలకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడజిల్లా రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన 33 ఏళ్ల గొల్లపల్లి విశాలాక్షికి తండ్రి గణపతిరావ్, తల్లి చిట్టి మాణిక్యం ఉన్నారు. కాగా ఆమె పదేళ్లక్రితం డిగ్రీ పాసై టెట్‌కు ప్రిపేర్ అయ్యింది. ఆ సమయంలో ఆమెకు మెదడులో కణితి ఏర్పడి ఆమె మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. దాంతో కుటుంబీకులు కాకినాడలోని ఓ ప్రైవేటు మానసిక ఆసుపత్రిలో చూపించారు. అనంతరం ఆమెకు విశాఖపట్నంలో మెరుగైన వైద్యం అందుతుండడంతో ఆమె ఆరోగ్యం కుదుటబడింది. 2022 నుంచి అక్కడ మందులనే వాడుతుంది. ఆమెకు గత 2 నెలల నుంచి విశాలాక్షి మానసిక ప్రవర్తన అసలు బాగుండకపోవడం, అరుపులు, కేక లు వేయడం, అందరినీ కొట్టడం చేస్తుండడంతో కుటుంబీకులు 15 రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించారు. ఆమెలో విపరీత ప్రవర్తన ఉండ డంతో ఆమెను ఫిమేల్ సెల్‌లో ఉంచి ఆమెకు వైద్యులు చికిత్సను అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె అందరినీ కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట ఆమె తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిరువురు నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని అక్కడకు వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించారు. తలుపుతీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని ఆ తల్లిదండ్రులు గమనించారు. అనంతరం అక్కడికి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ చేరుకుని విశాలాక్షి 70 శాతం కాలిపోయిందని గుర్తించి ఆమెను అక్కడినుంచి బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్య చికిత్స అందజేస్తున్నారు. దోమల చక్రం వెలిగించుకునేందుకు అక్కడ పెట్టిన అగ్గి పెట్టితో ఆమె గౌన్‌కు నిప్పు అంటించుకున్నట్లు డాక్టర్ రామచంద్రరావ్ తెలిపారు. విశాలాక్షి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

- సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై ఆగ్రహం

ముమ్మిడివరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరామ్ మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. భూముల మార్కెట్ విలువ పెంపుదల భాగాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శివరామ్ వచ్చిన సమయంలో సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో సిబ్బందిపై మండిపడ్డారు. సబ్‌రిజిస్ట్రార్ సెలవు పెట్టారని సిబ్బంది చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేసి జిల్లా రిజిస్ట్రార్‌కు ఫోన్‌చేసి అడిగారు. జనవరి ఒకటి నుంచి భూమివిలువల పెంపు నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్లకు సెలవు ఇవ్వరాదని ఆదేశాలు ఉన్నప్పటికీ మీరు సెలవు ఎలా ఇచ్చారని జి ల్లా రిజిస్ట్రార్‌పై శివరామ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్ సెలవు విషయం తనకు తెలియదని జిల్లా రిజిస్ట్రార్ చెప్పడంతో సబ్‌రిజిస్ట్రార్ నుంచి లిఖిత పూర్వక వివరణ కోరాలని ఆదేశించారు.

డాక్టర్ అంబేడ్కర్‌ను గౌరవించే పార్టీ బీజేపీ

- రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు సంతోషకరం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరంఅర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అమితంగా గౌరవించే పార్టీ బీజేపీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ తమ నాయకుడు అని అనేకసార్లు గొప్పగా చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను రెండుసార్లు ఎన్నికల్లో ఘోరంగా ఓడించి పార్లమెంట్‌లో అడుగు కూడా పెట్టనీయలేదన్నారు. బీజేపీకి రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం కానీ, రాజ్యాంగాన్ని మార్చాలనే భావన కానీ ఏనాడూ లేదన్నారు. ఆర్టికల్ 356ను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, అశేష ప్రజాదరణ కల్గిన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసి తర్వాత ఆంధ్రప్రజల అభిమానం కారణంగా ఒత్తిడి రావడంతో మళ్లీ ఎన్టీఆర్‌కు పట్టం కట్టారని చరిత్ర దీనికి సాక్ష్యం అని అన్నారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆధునీకరణ విషయంలో రీ డిజైన్ చేయడంవల్ల కొంత వ్యయం పెరిగే అవకాశం ఉందని, ప్రతిపాదనలన్నీ రైల్వే బోర్డుకు వెళ్లాయన్నారు. కొవిడ్‌కు ముందు కొవ్వూరు, నిడదవోలు స్టేషన్లలో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపేజీ తొలగించారని, దీన్ని పునరుద్ధరించేందుకు రెండుసార్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీల పొత్తులో ఉన్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల షేరింగ్ ప్యాట్రన్‌కు అనుగుణంగానే తమ వారికి పదవులు ఇచ్చారన్నారు. తాను రాజమండ్రికే పరిమితం కాదు, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా రాష్ట్రం అంతా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయం మా కార్యకర్తలకు అందరికీ బాగా తెలుసు అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి జరిగితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో 184 కిలోమీటర్ల పొడవైన ఎర్రకాలువకు సంబంధించిన ఆధునికీకరణపై కలెక్టర్‌ను డీపీఆర్ కోరామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే టిడ్కో గృహాలు శిథిలావస్థకు చేరాయని అన్నారు. దివంగత వాజ్‌పేయి కల నిజం చేస్తూ రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

29న రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

రాజానగరం/రంగంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ రైతు దివంగత గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఈ నెల 29న రంగంపేట మండలం వడిశలేరు వద్ద నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. మానవాళి మనుగడకు మూలాధారమైన వ్యవసాయదారులు, పశుసంపదను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడీబీ రోడ్డుకు ఆనుకుని ఉన్న గన్నివారి తోటలో ఆ రోజు ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు.. సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆరుగురు విజేతలకు ఆరు మోటార్ సైకిళ్లు, ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్, ద్వితీయ, తృతీయ బహుమతులుగా హోండా షైన్ బైక్‌లు, అలాగే 75 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బొప్పన బ్రహ్మాజీరావు, కూటి కోటేశ్వరరావు మొబైల్ నెంబర్లు 98481 87368; 90006 62999ను సంప్రదించవచ్చన్నారు.

రుడాలో ఫైల్స్ త్వరగా క్లియర్ చేయండి

- రుడా తొలి సమీక్షలో చైర్మన్ బీవీఆర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రుడా పరిధిలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫైల్స్ త్వరగా క్లియర్ చేయాలని చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సూచించారు. రుడా కార్యాలయంలో మంగళవారం రుడా వీసీ ,కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ప్లానింగ్ అధికారులతో ఆయన తొలి సమీక్ష నిర్వహించారు. రుడా నిధులతో జరుగుతున్న పనులు, ఇంజనీరింగ్ వర్కులు, ప్లానింగ్ విభాగంలో మాస్టర్ ప్లాన్లు, ఎల్ఆర్ఎస్, ఏపీడీపీఎంఎస్ ఫైల్స్‌పై చర్చించారు. త్వరలో రుడా పరిధిలోని నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని బొడ్డు వెంకటరమణ చౌదరి స్పష్టం చేశారు.



రుడా సమీక్ష సమావేశంలో చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, వీసీ కేతన్‌గార్గ్

హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీలు

- బాలికల విభాగంలో విజేతగా నిలిచిన శ్రీకాకుళం జట్టు
- ద్వితీయ స్థానం విజయనగరం జట్టు
- ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్
- విజేతలకు బహుమతులు అందజేత
- ఫైనల్‌కు చేరిన బాలుర జట్టు

రావులపాలెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో ఆంధ్రా కబడ్డీ అసోషియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు మూడో రోజు మంగళవారం బాలికల విభాగం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫైనల్‌కు చేరిన శ్రీకాకుళం, విజయనగరం బాలికల జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానంగా కృష్ణ, విశాఖపట్నం జట్లు నిలిచాయి. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకూ నువ్వానేనా అన్న విధంగా సాగడంతో క్రీడాభిమానులు ఆశక్తిగా వీక్షించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షులు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, అంజనీకుమార్‌రెడ్డితో పాటు పలువురు విజేతలకు కప్, బహుమతులను అందజేశారు. అదేవిధంగా బాలురు విభాగానికి సంబంధించి శ్రీకాకుళం, విజనగరం జట్లు ఫైనల్స్‌కు చేరాయి.





ప్రథమ స్థానం సాధించిన శ్రీకాకుళం జట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన విజయనగరం బాలికల జట్టుకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ రాహుల్ మీనా

వినియోగదారుల వివాదాల

సత్వర పరిష్కారానికి కమిషన్ దోహదం

- కాకినాడ జిల్లా జేసీ రాహుల్ మీనా

సర్పవరం జంక్షన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వినియోగదారుల హక్కులు, రక్షణ, వివాదాల పరిష్కారానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. సోమవారం వాకలపూడి ప్యారీ షుగర్ ప్యాక్టరీలో మైత్రి ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు, డీసీడీఆర్‌సీ సభ్యురాలు సీహెచ్ సుశీ, జిల్లా వినియోగదారుల సమాచార సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) అవగాహన సదస్సులో జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుల హక్కులకు భంగం వాటిల్లితే సత్వర న్యాయం కోసం వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రంలో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వస్తువులు, సేవలు, విలువల లోపాలు, భంగం వాటిల్లితే రూ.10నుంచి రూ50 లక్షల వరకు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే వెసులుబాటు ఉందన్నారు. వివాదాల సత్వర పరిష్కారం కోసం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాక్షిక న్యాయ సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. వస్తు, సేవల్లో లోపం జరిగితే ఇంటి వద్ద నుంచే వర్చువల్ విధానంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ-కామర్స్ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువుల సేవలు, నాణ్యతలో లోపాలుంటే కమిషన్‌కు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పాత్ర, సంబంధిత విభాగాలు, వినియోగదారుల వివాదాల సత్వర పరిష్కార కమిషన్‌పై డీఎస్‌వో టి. ప్రసన్నలక్ష్మీదేవి, డీసీడీఆర్‌సీ కాకినాడ ప్రెసిడెంట్ చెరుకూరి రఘపతి వసంతకుమార్, సభ్యులు సీహెచ్ సుశీ, సీహెచ్ నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పోస్టర్‌ని జేసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వి.రామసుబ్రమణియన్, డీసీడీఆర్‌సీ కన్వీనర్, అడ్వైజర్ భమిడి శివ ఎస్ఎస్ఎన్ మూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో నాటు సారా స్థావరాలపై..

ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల దాడులు

- 200 లీటర్ల నాటుసారా స్వాధీనం
- 18500 బెల్లం ఊట ధ్వంసం
- సారా డ్రమ్ములకు నిప్పు

ఎటపాక, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఎటపాక మండలంలోని గుండు వారిగూడెం, పిచ్చుకలపాడు గ్రామాల్లో మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇంటర్ స్టేట్ బోర్డర్స్ నాటుసారా నిర్మూలనలో భాగంగా ఆంధ్ర, తెలంగాణ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు, పోలీస్, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు జరిపారు. దాడుల్లో ఈరెండు గ్రామాల పరిధిలో 180 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. 18,500 లీటర్లు నాటుసారాకు ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెల్లం ఊటకు వినియోగించే 100 డ్రమ్ములను స్వాధీనం చేసుకుని, వాటికి నిప్పటించారు. గ్రామాల్లో నాటు సారా తయారీకి, రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆదేనుసారం ఈఎస్, ఎస్టీఎఫ్ సింగంశెట్టి మధు, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ నేతృత్వంలో దాడులు జరిపారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాల ఎక్సైజ్, ప్రొహిబిషన్, పోలీసులు, సీఆర్‌పీ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.





సారాను, డ్రమ్ములను చూపుతున్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు, డ్రమ్ములకు నిప్పంటిస్తున్న దృశ్యం

అంతర్వేది తీరంలో

డాల్ఫిన్ మృతి



అంతర్వేది తీరంలో మృతి చెందిన డాల్ఫిన్

అంతర్వేది, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర తీరంలో తరుచూ డాల్ఫిన్లు ఒడ్డుకు వసున్నాయి. రెండు రోజులుగా ఒక డాల్ఫిన్ అంతర్వేది సముద్ర కెరటాల తాకిడికి ఒడ్డుకు రావడంతో స్థానికులు డాల్ఫిన్‌ను చూసి కాపాడే ప్రయత్నం చేశారు. సముద్రం లోపలకు వెళ్లి డాల్ఫిన్‌ను వదిలారు. మంగళవారం ఆ డాల్ఫిన్ తిరిగి ఒడ్డుకు చేరి మృతి చెందింది. గతంలో సముద్ర తీరంలో పెద్ద పెద్ద తాబేళ్లు, భారీ చేపలు, డాల్ఫిన్లు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. సముద్రంలో బలమైన గాయాలపాలై నీటిలో ఈదుకుంటూ ప్రాణాపాయస్థితిలో ఉన్న తాబేళ్లు, డాల్ఫిన్లు, చేపలు సముద్ర తీర ప్రాంతానికి చేరి మృతి చెందుతున్నాయి.

ఏజెన్సీ తహశీల్దారు శ్రీనివాసరావుపై

కోర్టు ధిక్కారణ కేసు

- రేపు హాజరు కావాలని నోటీసు జారీ చేసిన హైకోర్టు

రంపచోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఏజెన్సీ లోని తహశీల్దారు చిన్నం శ్రీనివాసరావుపై రాష్ట్ర హైకోర్టులో నమోదైన కోర్టు ధిక్కార కేసులో ఈనెల 26న హాజరుకావాలని హైకోర్టు నోటీసు జారీ చేసింది. గిరిజన భూమి బదలాయింపు కేసులో తీర్పును అమలు చేయాలంటూ రెండు వేర్వేరు పార్టీలు రెండు వేర్వేరు కేసులు దాఖలు చేయగా, వాటిపై ఈ సంవత్సరం మార్చిలో హైకోర్టు ఉమ్మడిగా తీర్పు చెప్పి, మూడునెలలోగా తగుచర్యలు తీసుకోవాలని అడ్డతీగల తహశీల్దారుకు ఉత్తర్వులు జారీ చేసింది. కానీ తహశీల్దారు పని చేసిన చిన్నం శ్రీనివాసరావు సదరు హైకోర్టు తీర్పును అమలు చేయలేదంటూ హైకోర్టులో కోర్టు ధిక్కారణ కేసు నమోదైంది. గతంలో అడ్డతీగల తహశీల్దారుగా పనిచేసిన సదరు శ్రీనివాసరావు ప్రస్తుతం గంగవరం మండల తహశీల్దారుగా పనిచేస్తున్నారు.

వేర్వేరు చోట్ల వెయ్యి గ్రాముల వెండి వస్తువుల అపహరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం త్రీటౌన్ పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన దొంగతనాలలో వెయ్యి గ్రాముల వెండి వస్తువులు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రంగ్రీజుపేటకు చెందిన వీరగణేష్ అనే వ్యక్తి ఈనెల 7న కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని హైదరాబాద్ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మంగళవారం వచ్చాడు. ఇంటి తాళాలు తీసి లోపల బీరువా తెరిచి ఉండడంతో చూస్తే బీరువా పెట్టిన 750 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని దొంగలు అపహరించుకుపోయారని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా లింగంపేటకు చెందిన దుర్గాదేవి అనే మహిళ తన ఇంటి కింద పోర్షన్‌కు ఈనెల 10న తాళాలు వేసి పై పోర్షన్‌లోని అత్తవారి వద్దకు వెళ్ళి ఆ రోజు అక్కడే పడుకుంది. మరుసటి రోజు కిందకు దిగి చూస్తే తాళాలు పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో పెట్టిన 250 గ్రా ములు వెండి వస్తువులు కనిపించలేదు. ఇళ్లంతా వెతికినా కనిపించక పోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపులో సేల్స్‌ట్యాక్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని చర్చి సెంటర్లో గల ఆరుద్ర మొబైల్స్‌లో సేల్స్‌ట్యాక్స్ జీఎస్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బిల్లులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని, ఇన్‌వాయిస్‌లు, కస్టమర్లకు ఇచ్చే బిల్లుల్లో వత్యాసాలు ఉంటున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు వారు షాపులోని రికార్డులు, బిల్లులు, కంప్యూటర్లను తనిఖీ చేశారు. షాపులో తనిఖీలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయిలో పరిశీలన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని సేల్స్‌ట్యాక్స్ సూపరింటెండెంట్ కమలాకర్ తెలిపారు. కాగా మొబైల్ షాపులో తనిఖీల చిత్రీకరణకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం





పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద విద్యుద్దీపాల వెలుగులో బేతెస్థ ప్రార్థనా మందిరం, సామర్లకోటలో ఒక ఇంటిని విద్యుద్దీపాలు, స్టార్లతో అలంకరణ

క్రిస్మస్ శోభ

విద్యుత్ కాంతుల వెలుగులో చర్చిలు... ప్రార్థనల్లో క్రైస్తవులు

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే క్రిస్మస్‌కు పిఠాపురం నియోజకవర్గం సన్నద్ధమైంది. పలుచోట్ల పరిశుద్ధ ఆరాధనలు, క్రిస్మస్ ఈవ్ నిర్వహించారు. మార్కెట్లకు క్రిస్మస్ శోభ చేకూరింది. పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చి, ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద గల బేతెస్థ ప్రార్థనా మందిరంతో పాటు కత్తులగూడెం, డ్రైవర్స్ కాలనీ, మోహన్‌నగర్, మంగాయమ్మరావుపేట, సీతయ్యగారితోట, తహసీల్దారు కార్యాలయం సెంటరు ప్రాంతాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు మంగళవారం సాయంత్రం నుంచే చర్చిలకు చేరుకుని ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు. రాత్రి కేరల్స్ సర్వీసు జరిగింది. క్రైస్తవులు కేండిల్స్‌తో ప్రదర్శనలు నిర్వహించారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ఆయా చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించనున్నారు.

క్రిస్మస్ జరుపుకునేందుకు కొత్త వస్త్రాలు, ఇతర సామాన్లు కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో మార్కెట్ దారులన్నీ జనసమర్థంగా మారాయి. వస్త్ర దుకాణాలతో పాటు రంగురంగుల బెలూన్లు, స్టార్లు, ఇతర సామగ్రి విక్రయ దుకాణాలు రద్దీగా ఉన్నాయి.

పిఠాపురం పట్టణంలోని పలు పాఠశాలల్లో మంగళవారం క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. భాష్యం స్కూలులో లిటిల్ చాంప్స్ విద్యార్థులు క్రిస్మస్ తాత, మేరీమాత, శాంతాక్లాజ్, ఏసుప్రభువు, ఏంజెల్స్, గొర్రెలకాపర్ల వేషధారణల్లో అలరించారు. క్రిస్మస్ గీతాలు ఆలపించారు. క్రీస్తు జననం, క్రిస్మస్ ప్రాముఖ్యతను బ్రదర్ సూర్యప్రకాష్ వివరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులోని శ్రీచైతన్య స్కూలులో క్రిస్మస్ సంబరాలు జరిగాయి.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సామూహిక ప్రార్థనలతో క్రిస్మస్ జరుపుకున్నారు. వేట్లపాలెంలో పాస్టర్ దానియేలు ఆధ్వర్యంలో గుణ్ణం వీరభద్రరావు ఇంట్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించి యేసు రాకను స్వాగతిస్తూ భారీ కేక్ కట్ చేశారు. క్యాండిల్ లైట్ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సామూహిక విందు ఆరగించారు. గుణ్ణం కుటుంబీకులు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. సామర్లకోట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి నక్షత్రాలను ప్రదర్శించారు.

సామర్లకోట భాష్యం విద్యా సంస్థల్లో పలు తరగతుల విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. శాంతాక్లాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భాష్యం రామకృష్ణ, గోవిందరాజులు, ప్రిన్సిపాల్ సూర్య, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిఠాపురం భాష్యం స్కూలులో...



సామర్లకోట మండలం వేట్లపాలెంలో కేక్ కటింగ్



ఉప్పాడ సెంటర్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెట్టుకుంటే అభినందన... లేకుంటే జరిమానా

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకున్న వాహనచోదకులకు అభినందనలు... పెట్టుకోని వారికి జరిమానా విధించి అక్కడికక్కడే మీ-సేవా కేంద్రాల ద్వారా ఫైన్ చెల్లించేలా చర్యలు... హెల్మెట్ ధారణపై హైకోర్టు కఠిన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు పోలీసులు అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ఉప్పాడ సెంటర్లో మంగళవారం సాయంత్రం పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్‌లోని ఎస్ఐలు వాహన తనిఖీలు నిర్వహించారు, హెల్మెట్ పెట్టుకున్న వారిని అభినందించారు. పెట్టుకోకుండా నడుపుతున్న వారికి జరిమానా విధించారు. అనంతరం హెల్మెట్ వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధించడంతో పాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.



క్రికెట్ కిట్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

'దాతల సహకారం మరువలేనిది'

కరప, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలకు తమ వంతు సాయమందిస్తున్న దాతల సహకారం మరువలేనిదని కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పేర్కొన్నారు. కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రూ.15వేలు విలువచేసే క్రికెట్ కిట్‌ను కొత్తపేట వీధి జట్టుకు అందజేశారు. తిమ్మాపురం ఏఎస్ఐ బొల్లంరెడ్డి వీరవెంకటసత్యనారాయణ, ఆత్రేయపురపు ఉదయ్ ఈ కిట్ సమకూర్చారు. పల్లపు వీధి క్రికెట్ టీమ్‌కు రూ.17వేలు విలువచేసే కిట్‌ను కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వీజీ సత్యనారాయణ అందజేశారు. దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



సామాజిక తనిఖీ గురించి వివరిస్తున్న ఎస్ఆర్‌పీ సింహాద్రి

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ భావన సూచించారు. ఉపాధి పథకం ద్వారా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన సాధారణ, మెటీరియల్ కాంపోనెంట్ పనులపై నిర్వహించనున్న సామాజిక తనిఖీపై అన్ని శాఖల అధికారులు, డీఆర్పీలతో మంగళవారం గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు, సోషల్ ఆడిట్ అనంతరం గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి చివరగా మండలస్థాయి సదస్సు ఏర్పాటు చేస్తామని ఎస్ఆర్‌పీ సింహాద్రి వివరించారు. సామాజిక తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలను ఇందులో వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న, ఏపీవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజరు దాస్

'పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు'

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజరు హెచ్.దాసు తెలిపారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నగా వ్యాపారం మొదలుపెట్టిన వారే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళా సాధికారికతకు బ్యాంకులు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు గొల్లప్రోలు మేనేజరు నరసింహరాజు, బీఆర్ ఎం సూర్య విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ చర్చిలో చిన్నారుల నృత్య ప్రదర్శన

క్రిస్మస్ ముందస్తు వేడుకలు

పిఠాపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకలు జరిగాయి. జల్లూరులోని బర్నింగ్ టూల్స్ మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాస్టర్లు కె.ఎలీషా, వి.జాన్ పాల్ క్రిస్మస్ వాక్యోప సందేశాన్ని అందించారు. గ్రామంలో క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు.



రాజేశ్వరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేశ్వరి సేవలు చిరస్మరణీయం

పిఠాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రథమ మహిళా చైర్‌పర్సన్‌గా, రెండు పర్యాయాలు చైర్మన్‌గా పట్టణాభివృద్ధికి దేవరపల్లి రాజరాజేశ్వరి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం రాజేశ్వరి 15వ వర్ధంతి సందర్భంగా రాజరామ్మోహనరాయ్ పార్కులోని ఆమె విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేశ్వరి సోదరుడు, పీసీసీ కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నాయకుడు డాక్టర్ పిల్లా శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లిపూడి రాంబాబు, పంతం నెహ్రూ, మునిసిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి స్థలాన్ని ఆర్డీవో ఎస్.మల్లిబాబు మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు ఉప్పాడ-కాకినాడ రహదారిలో కొత్తపట్నం వద్ద మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు సమీపంలోని స్థలాన్ని ఆయన చూశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఈ స్థలం అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదనలు తయారు చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట కొత్తపల్లి తహసీల్దారు జి.చిన్నారావు, టీటీడీ ఏఈఈ రవికుమార్, ఆర్ఐ మధుకుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వున్నారు.

అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా బీఎస్పీ ధర్నా

కాకినాడ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు ధర్నా చేశారు. అక్కడి నుంచి ఊరేగింపుగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపి జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అధ్యక్షత వహించిన బీఎస్పీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం (సుబ్బు భాయ్) మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై దేశ ద్రోహం కేసు పెట్టాలని, ఆయన జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల నాయకులు రామేశ్వరరావు, డాక్టర్ భానుమతి, మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు లింగం శివకుమార్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సబ్బారపు అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కండవల్లి లోవరాజు, జిల్లా కోశాధికారి సాధనాల రాజు, పిల్లి శివకుమార్, ఉల్లం రవి, బుల్లి రాజు, పిల్లి రామారావు, కాశి రామారావు, సాలె రాజేష్, మాతా అప్పారావు, బ్రహ్మాజీ, పండు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీఎస్పీ, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు

కరప విష్ణాలయంలో విశేష పూజలు

కరప, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేణుగోపాల, వేంకటేశ్వర, అభయాంజనేయ స్వామి వార్ల ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, అర్చకులు మహోన్నత కార్యక్రమాలు చేపట్టారు. తొలుత స్వామివార్లకు పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం వేణుగోపాలస్వామికి లక్ష తులసి, లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమార్చన, వేంకటేశ్వరస్వామికి పుష్పార్చన, అభయాంజనేయస్వామికి సింధూర అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు పెద్దింటి అనంతాచార్యులు, సూర్యనారాయణ, వాడపల్లి గోపాలాచార్యులు, పెద్దింటి సీతారామాచార్యులు పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి పూజలను వీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో కె.తిరుమలరవితేజ, వడ్డాది సత్యనారాయణ, ఎం.మురళీవీరభద్రరావు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధి డీహెచ్‌వీ సాంబశివరావు పాల్గొన్నారు.



విష్ణాలయంలో లక్ష తులసి, కుంకుమార్చనను తిలకిస్తున్న మహిళలు

ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు

కొత్తపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు అందరికీ ప్రభువని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఉప్పాడలో మత్స్యకార నాయకుడు, జన సైనికుడు గంటా విజయకుమార్ (జీవీకే) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జనసేన నాయకుడు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

ఏఐ టూల్స్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభం

గండేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఐ టూల్స్ అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డి.నాగతేజ్ ప్రారంభించారు. ఈ కోర్సు ఈనెల 28వరకు జరుగుతుందని ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్ తెలిపారు.

ఏపీఎంఈయూ ఆవిర్భావ వేడుకలు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీఎంఈయూ) 72వ ఆవిర్భావ వేడుకలను అధ్యక్షుడు కట్టిమేను మోహన్‌రావ్ అధ్యక్షతన కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కిర్ల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జీజీహెచ్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల లోటును భర్తీ చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఏపీఎంఈయూ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఏపీఎంఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.స్వామిబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, డైటీషియన్ సురేంద్ర, సంఘ ఉపాధ్యక్షులు వై.రాజుబాబు, ఎస్.రాజుబాబు, జాయింట్ సెక్రటరీలు వి.సత్యనారాయణ, అలీషా, పండు, జోగరావ్, నానిబాబు, సత్యనారాయణ, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న ఏపీఎంఈయూ ఉద్యోగులు

నూతన వధూవరులను ఆశీర్వదించిన నవీన్

జగ్గంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన రెడ్డి శ్రీను కుమారుడు వివాహం కాకినాడ ఎస్ఆర్ఎంటీ హాల్లో ఘనంగా జరిగింది. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి


నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, భర్త మఠం విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలు, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

మోక్షిత వైద్యానికి రూ.11లక్షలు

రంపచోడవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న పాపకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రూ.11లక్షలు మంజూరు చేశారు. ఎటపాక మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన మూడేళ్ల కొత్తపల్లి జయరాజు కుమార్తె మోక్షిత గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్య ఖర్చులు రూ.22లక్షలు అ వుతుందని డాక్టర్లు తెలిపారు. ఈమేరకు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మంగళవారం సీఎం వద్దకు తీసుకువెళ్లారు. మోక్షిత వైద్యానికి సీఎం సహాయనిధి నుంచి రూ.11లక్షలు మంజూరు చేశారు.

డీఎడ్ కళాశాల పీడీని శిక్షించాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

రంపచోడవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎడ్ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పీడీ కె.పోతురాజును చట్ట పరంగా శిక్షించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం ఆమె కళాశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. పీడీ అసభ్యకరంగా మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ ముట్టుకోవడం, కులాలు, మతాలను ఎంచుతూ మాట్లాడేవారని విద్యార్థినులు ఎమ్మెల్యేకు వివరించారు. పీడీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి గిరిజన సంఘాల నాయకుల మద్దతు కోరడం దారుణమని, గిరిజన సంఘాల పెద్దలు వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీసా ఆవిర్భావ దినోత్సవం



మోతుగూడెం: దూలయ్యకు ధ్రువప్రత్రం ఇస్తున్న దృశ్యం, చింతూరు: పీవో భరత్‌ను ఆహ్వానిస్తున్న సచివాలయం సిబ్బంది


దేవీపట్నం: మాట్లాడుతున్న సర్పంచ్ రాజామణి

మోతుగూడెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం పీసా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. చింతూరు ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మోహన్ నేతృత్వంలో పీసా ఎన్నికలు జరిగాయి. పీసా గ్రామ సభకు చైర్మన్‌గా ఆకేటి సీత ఉండగా ఉపాధ్యక్షుడుగా మడివి దూలయ్య, కార్యదర్శిగా మడకం సుశీల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మోహన్ మాట్లాడుతూ పీసా చట్టం అమలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి పథకాలు, పేదరిక నిర్మూలన, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికపై వివరించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఏదైనా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే విషయంలో భూసేకరణ విషయంలో, పునరావాసం కల్పించడంలో, చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ, చేపల చెరువుల నిర్వహణ, ఖనిజాలు వెలికితీత, క్వారీ అనుమతులు తదితర వాటికి గ్రామసభ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చింతూరు ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మోహన్ నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, వార్డుమెంబర్ రాజీ, మాజీ సర్పంచ్ కారం బాబులు, మాజీ ఎంపీటీసీ మొండేటి వెంకటేశ్వరరావు, మోతుగూడెం పంచాయతీ చుట్టుప్రక్కల గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

కొన్నిచోట్ల వాయిదా పడిన ఎన్నికలు

వై.రామవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో పీసా కమిటీ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా సభల్లో పీసా చట్టం, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రవికిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పీసా చట్టం వల్ల గిరిజన గ్రామాల ప్రజలకు కలిగే హక్కులు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వై.రామవరం, పి.యర్రగొండ గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి హరి తెలిపారు. కాగా వై.రామవరంలో ఈనెల 28న ఎన్నిక నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి లోవరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పీసా దినోత్సవం

దేవీపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1 ఏనుగులగూడెం గ్రామంలో పెసా దినోత్సవం సందర్భంగా దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, పెసా సభ్యులు పాల్గొన్నారు.

పీసా వేడుకలు

చింతూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): చింతూరులో పీసా (పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ ఏరియా) చట్టం అమలు దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ముకునూరులో నిర్వహించిన వేడుకలకు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ హాజరయ్యారు. ఈసందర్భంగా పీవో భరత్ మాట్లాడుతూ పీసా చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చింతూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కారం కన్నారావు పీసా చట్టం గురించి వివరించారు. ఆయా కార్యక్రమాలల్లో ఎంపీడీవో చైతన్య కల్యాణ్ జై భరత్‌దేవ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌డీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కిషోర బాలికల భవిష్యత్ అందరి బాధ్యత


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐటీడీఏ పీవో

చింతూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కిషోరి బాలికల భవిష్యత్‌ను తీర్చి దిద్దే బాధ్యతను ప్రతి శాఖ తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కిషోరి వికాసంపై ఐసీడీఎస్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీఓ అపూర్వ భరత్ హాజరయ్యారు. బాలికలు చదువుతో తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. బాలికల ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులు నిత్య పర్యవేక్షణ ఉండాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజంపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయగౌరి, తులసిపాకల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఉదయ్ కుమార్, సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.రమేష్, ఎంఈవో జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి

దేవీపట్నం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి అన్నారు. మంగళవారం ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో బాల్యవివాహాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. 18ఏళ్లు రాగానే పెళ్లికోసం ఆలోచించవద్దని, విద్యార్థులను ప్రోత్సహించి బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, పీసా కమిటీ పెంటన్నదొర, నాగిరెడ్డి, గ్రామస్తులు నాగరాజు, భద్రం దొర, అబ్బాయిరెడ్డి పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

చింతూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అలెర్ట్ స్వచ్ఛంద సంస్థ మంగళవారం చింతూరు, వరరామచంద్రపురం మండలాల్లో 510 ఆదివాసీ కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేసింది. అనంతరం దోమతెరల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఏవీ సత్యనారాయణ, ఆర్గనైజర్లు పండా కల్యాణి, రంగమ్మ, సాయికృష్ణ, టీడీపీ చింతూరు మండల శాఖ అధ్యక్షుడు ఇల్ల చిన్నారెడ్డి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు మడివి రాజు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

క్రిస్మస్ సందడి

• ముస్తాబైన క్రైస్తవ మందిరాలు
• చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రార్థనా మందిరం

విద్యుత్ కాంతులతో ఏలేశ్వరంలో ఆర్‌సీఎం చర్చి

ఏలేశ్వరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు మండలంలోని చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనల కోసం సర్వం సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో పశువులపాకలను ఏర్పాటు చేసి బాలయేసు విగ్రహాలను ఏర్పాటు చేశారు. క్రీస్తు జన్మదినాన్ని పురష్కరించుకొని ఆర్‌సీఎం, లూథరన్ చర్చిల ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యుత్ సెట్టింగ్‌ల ఆకట్టుకున్నాయి. బాలయేసు పశువులపాకలో జన్మించినట్లుగా సెట్టింగ్‌లు వేసి విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే క్రైస్తవులు తమ ఇళ్ల పై రంగు రంగుల స్టార్‌లను ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా కేకులకు, విద్యుత్ స్టార్‌లకు భారీగా డిమాండ్ పెరిగింది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రత్తిపాడు: ధర్మవరం బేతస్త ఎరుసలేం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ మురళీరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి క్రీస్తు సందేశాలు వివరించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ సుధాకర్, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబులు కేక్ కట్‌చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించగా ఏవో శ్రీనివాస్, ఏపీవో కుమార్ స్వామి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ కేక్ కట్‌చేసి క్రిస్మస్‌వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి, మండల సర్వేయర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు. మినర్వా విద్యాసంస్థల ప్రాంగణంలో మినర్వా విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలో అలరించారు.

ప్రపంచమంతా జరుపుకునే పండుగ క్రిస్మస్

● **జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్**

జగ్గంపేట: స్థానిక జ్యోతుల నెహ్రూ కాలనీలో గల జీసెస్ ప్రేయర్ చర్చిలో జగ్గంపేట మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ వెలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. అనంతరం మండలంలోని దైవజనులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని గత ఎన్నికల్లో మాకు మీరు ఇచ్చిన సహకారం మరువలేదన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండబాబు, జీను మణిబాబు, వేములకొండ జోగారావు, నీలం శ్రీను, బొండా రాజేష్,వెలిశెట్టి బుజ్జి, దైవజనులు మండలి పాస్టర్స్ అసోసియేషన్స్ సెక్రటరీసాంబేరపుఎలీషారాజు, ఆశీర్వాద్, దైవ జనులు పాల్గొన్నారు.


ధర్మవరంలో క్రిస్మస్ కేక్‌ను సర్పంచ్ బెంతుకుర్తి సుశీలకు తినిపిస్తున్న దృశ్యం


వస్త్రాలు పంపిణీ చేస్తున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చింతలూరులో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించినట్లు మాట్లాడటం దారుణమన్నారు. అమిత్‌షా రాజీనామా చేయాలని వారు నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, విప్లవయువజన సంఘం అధ్యక్షుడు తాడి లక్ష్మణరావు, లిబరేషన్ నాయకులు అప్పారావు, బాలరాజు, అప్పారావు, చల్లబాబు, కాకరమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

జగ్గంపేటరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యసభలో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై తక్షణం క్షమాపణ చెప్పాలని జగ్గంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 31లోగా క్షమాపణలు చెప్పకపోతే ఆమరణ నివాహార దీక్షకు దిగుతానన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో నిరసనలు, చేపతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వత్స వాయిబాబు, పీసీసీ జనరల్ సెక్రటరీ నక్క సత్యనారాయణ, చంద్రమౌళి, కాటే జయ పాల్గొన్నారు.

సహకార సంఘాలు పటిష్టమే ధ్యేయం

● **కో ఆర్డినేటర్ శ్రీనివాస్**


సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రతెలంగాణా కో ఆర్డినేటర్

ప్రత్తిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పటిష్టతకు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆంధ్రా, తెలంగాణా కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని ఒమ్మంగి, లంపకలోవ సొసైటీల్లో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘాల పనితీరు తెలుసుకునేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి సంఘాలను ఏవిధంగా బలోపేతం చేయాలనే అంశంపై నివేదికలను కేంద్ర సహకార మంత్రిత్వశాఖకు అందజేయనున్నట్లు తెలిపారు. కాకినానాడ జిల్లాలోని 15 సొసైటీలను సందర్శించి సమావేశాలు ఏర్పాటుచేయడం ద్వారా 2వేల మంది అభిప్రాయాలు తెలుసుకుని ప్రణాళికలు రూపొందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సహకార అభివృద్ధి కమిటీలు ఎప్పటికప్పుడు సంఘాల పనితీరు, అభివృద్ధిపై సమీక్షిస్తాయని తెలిపారు. నూతనంగా సొసైటీల పునరుద్ధరించడంపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. అనంతరం డీసీసీబీ ఏజీఎం శ్రీనివాసరావు, మేనేజర్ కె.రమణ, హెడ్ ఆఫీస్ నవీన్‌లతో కలిసి ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కో ఆర్డినేటర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసి సహకార సంఘాల బలోపేతంపై వివరించారు.

సహకార సంఘాల విస్తరణకు కృషి

ఏలేశ్వరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడు తూ కేంద్ర మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయాలలో భాగంగా రాష్ట్రాల పరిధిలో సహకారసంఘాల విస్తరణకు, సంఘాలు బలోపేతానికి వనరులు సమీకరణకు, కంప్యూటరైజేషన్, కేంద్ర ప్రభుత్వ పథకాలు వంటి పలు అంశాలపై సంఘ సభ్యులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా నాబార్డు ద్వారా నూతనంగా ఫిషరీస్ సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు రానున్న కాలంలో అందుబాటులోకి రానున్నాయన్నారు. డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సూపర్‌వైజర్ నాగేంద్ర, సీఈవో జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, కర్రోతు గాంధీ, బంటుపల్లి సత్యనారాయణ, గూనాపు అప్పలరాజు ఉన్నారు.

మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీను, రాజబాబు ఎన్నిక


యూటీఎఫ్ నూతన కమిటీ కార్యవర్గం ఎన్నికైన దృశ్యం

ప్రత్తిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం యూటీఎఫ్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మళ్లీ కోడి శ్రీను, దొడ్డిపట్ల రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎమ్మార్సీ సమావేశ మందిరంలో మంగళవారం మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా కోడి శ్రీనివాస్, మండల ప్రధా కార్యదర్శిగా దొడ్డి పట్ల రాజబాబు, అసోసియేట్ మహిళా అధ్యక్షులుగా సీహెచ్ సూర్యవతి, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ రమణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా రవితేజ, పత్రికా సంపాదకులుగా ఎం.రమేష్, ఆడిటర్‌గా ఎం.స్వామికుమార్‌లతో కూడిన కమిటీని 90 మంది ఉపాధ్యాయులు ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సాయిరాం, నూకరాజు, వీవీ రమణ, ఆర్.రామలింగేశ్వరరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రసాద్‌బాబు, చుక్కల గణేష్, ఎస్. రాజేష్, పనసయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

ఏలేశ్వరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నగేష్, సీనియర్ కామ్రేడ్ రాంబాబు నేతృత్వంలో అధ్యక్షుడిగా ఎస్.సంజీవ్, బి.రాంబాబు, నాగమణి, ప్రధాన కార్యదర్శి కె.రవి, కోశాధికారి టి.మురళీకృష్ణ, కార్యదర్శులు రాజు, అప్పలరాజు, గంగాధర్, దేవదేవి, శిరీష, శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వారబాబు, రెడ్డి, నాగేంద్రరావు, రాజులను ఎన్నుకున్నారు.

'యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలి'

కిర్లంపూడి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి మహిళా సమాఖ్యలో స్త్రీనిధి సొమ్ములు స్వాహాచేసి పరారీలో ఉన్న బూరుగుపూడి గ్రామానికి చెందిన యానిమేటర్ కంచర్ల దుర్గపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డ్వాక్రా సంఘాల మహిళలు మంగళవారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల గుండెల్లో గుబులు

తేమ శాతం ఎక్కువ ఉంటే కొనలేమంటున్న అధికారులు

రాజవొమ్మంగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు వారాలుగా వాతావరణ మార్పులతో రైతులు ప్రతిక్షణం బెంబేలెత్తిపోతున్నారు. కొయ్యకుండ రైతులు నిరీక్షించిన తర్వాత వాతావరణ మార్పు తరువాత కోతలు కోశారు. అయితే మళ్లీ వాతావరణ పరిస్థితులతో కోసిన పంట రోడ్డుపై రైతులు ఆరబెట్టారు. ఆరబోసిన ధాన్యం తేమ శాతం తగ్గక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగి మండలంలో 600మెట్రిక్ టన్నుల ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతానికి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయలేమని అధికారులు స్పష్టం చేయడంతో రైతులకు ఏమిచేయలో తెలియని అయోమయస్థితిలో ఉన్నారు. ఇదే అదునుగా కొందరూ దళారులు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే రూ.150తక్కువ ఇచ్చి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం స్పందించి తేమ శాతం ఎక్కువ ఉన్నా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలో 6,321ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా ఇప్పటివరకు 2,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి చక్రధర్ తెలిపారు. ధాన్యంలో తేమ శాతం 17లోపు ఉంటే మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు: సబ్‌కలెక్టర్

రాజవొమ్మంగి డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టిగెడ్డ గ్రామ శివారులో ధాన్యం బస్తాలతో రోడ్డుపై ఉన్న రైతులతో సబ్‌కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నగదును రైతు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకున్నామని ఆమె అన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

దూసరపాములో రెవెన్యూ గ్రామసభ

రాజవొమ్మంగి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): దూసరపాము గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ సర్పంచ్ చీడి శివ అధ్యక్షతన జరిగింది. ఈ పాస్ పుస్తకాలు, మ్యూటేషన్లు, ఎఫ్ లైన్ సమస్యలపై 14అర్జీలు వచ్చాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చెల్లయ్యమ్మ తెలిపారు. ఎంపీటీసీ సత్యనారాయణ, పీసా ఉపాధ్యక్షుడు పరంజ్యోతిరాజు, గ్రామ రెవెన్యూ అధికారి అన్నిక శ్రీనివాస్, గ్రామ సర్వేయర్, రాంబాబు, అప్పన్నరెడ్డి పాల్గొన్నారు.

వెంకంపాలెంలో రెవెన్యూ సదస్సు

వీఆర్.పురం,డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నమట్టపల్లి గ్రామపంచాయతీ పరిధి వెంకంపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు తహశీల్దార్ నిర్వహించారు. భూమి పట్టాల మార్పుపై రెవెన్యూ అధికారులకు రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నా రు. ఆర్ఐ మడకం రామకృష్ణ, అధికారులు, టీడీపీ నాయకులు బీరక సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వై.రామవరం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వై.రామవరంలో లెవెన్స్ ఇవాంజికల్ లూథరన్ చర్చిలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరిపారు. చర్చి వ్యవస్థాపకుడు జార్జి కుటుంబరావు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల నుంచి రెవరెండస్, పాస్టర్లు హాజరై క్రీస్తు బోధనలు వినిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


పీఎంపీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవం

జగ్గంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం జగ్గంపేట, గండేపల్లి మండలాల ఆధ్వర్యంలో షాదీఖానా ఆవరణలో మండల అధ్యక్షుడు షేక్‌నూరుద్దీన్ బాషా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు హాజరై సంఘ వ్యవస్థాపకుడు దివంగత ఆర్కే భరద్వాజ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గంపేట సభ్యులను అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ళ రాంబాబు, రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎండీ తానీషా, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్న పీఎంపీడే విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జగతా బాబ్జీ, కోశాధికారి ఎ.సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు టీఎస్‌మూర్తి,గౌరవ సలహాదారు పి.నాగరాజు, ఉపాధ్యక్షుడు పీవీవీఎస్ మూర్తి, సహాయ కార్యదర్శి కె.పెద్దిరాజు, దొడ్డిసుబ్బారావు, కె. రామమూర్తి, తదితర పీఎంపీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఆదిత్యలో ఏఐ టూల్స్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభం

గండేపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ (సెంటర్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏఐ టూల్స్ అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డి.నాగతేజ్ ప్రారంభించి జనరేటివ్ ఏఐ, టెక్స్ట్ బేస్ట్ ఏఐ, ఇమేజ్ ఏఐ, ఆడియో ఏఐ వంటి ఆధునిక టూల్స్‌పై వివరించారు. ఈ కోర్సు ఈనెల 28 వరకు జరుగుతుందని ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్ తెలిపారు.

తలకు భారం కాదు ప్రాణాలకు రక్షణ

తుని రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ తలకు భారం కాదు. ప్రాణాలకు రక్షణ అని తుని పట్టణ ఎస్ఐ విజయ్‌బాబు స్పష్టం చేశారు. హై కోర్టు ఉత్తర్వులను అనుసరించి జిల్లా ఎస్పీ ఆదేశాలతో ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు క్రమం తప్పకుండా హెల్మెట్లను వినియోగించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే మొదటిసారి అపరాధ రుసుముతో సరిపెడతామని, అదే వ్యక్తి రెండోసారి పట్టుబడితే వాహనాన్ని జప్తుచేయడం కానీ, డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడం కానీ చేస్తామన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ రీసోర్స్ పర్సన్ పి.సింహాద్రి

ప్రత్తిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎటువంటి వ్యక్తిగత అంశాలకు తావు ఉండదని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్టేట్ రీసోర్స్ పర్సన్ పంతం సింహాద్రి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సామాజిక తనిఖీ అవగాహన సమావేశానికి ఎంపీపీ జీకే సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలు నిర్వహిస్తామని రీసోర్స్‌పర్సన్ సింహాద్రి తెలిపారు. ఎంపీపీ జీకే సుధాకర్, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు మాట్లాడుతూ మండలంలో గత ఏడాది కాలంలో ఉపాధి పథకంలో భాగంగా 1006 పనులకు సంబంధించి రూ.11,74,49,000 పనులు నిర్వహించామని ఈ పనులకు సంబంధించి గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈవోపీఆర్డీ కాశీవిశ్వనాధ్, ఏపీవోలు కుమార్ స్వామి, నాయుడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, తనిఖీ సీఆర్పీలు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్‌వద్ద ప్రతి మంగళవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రమేష్ భోజనాలు వడ్డించారు. ఈ క్యాంటీన్‌లో 500 మందికి భోజనాలు స్వీకరించారు. ఈ సందర్భం గా రమేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ స్ఫూర్తితో ఐదునెలల నుంచి డొక్కా సీత మ్మ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మరిసే రామకృష్ణ, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, సత్తి సోమరాజు, కాకిలేని బాబ్జి, కాయల మణికంఠ, గంధంశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్